విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

అంబేద్కర్ యూత్ క్యాలండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఏపీ ట్రాన్స్కో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రెటరీ కొల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం పెనుమల్ల-సావరంలో అంబేద్కర్ యూత్ న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ భావజాల ప్రతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాఖపట్నం ఎన్ఎస్టిఎల్, రిటైర్డ్ సైంటిఫిక్ ఆఫీసర్ ఎస్ఆర్ వేమన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సభలో వేమన మాట్లాడుతూ అంబేద్కరిజం అంటే ఏదో ఒక కులానికి చెందిన భావన కాదని, సమసమాజ అభివృద్ధికి సంబంధించిన ఒక దిక్సూచి అని ఉద్ఘోదించారు. ట్రాన్స్కో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలం సమాజంలో పెంపొందించే భాధ్యతలలో భాగంగా అంబేద్కర్ రచనలు అందరూ చదవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాటన్ కార్పొరేషన్ సీనియర్ ఆఫీసర్ కొల్లు తిరుమలరావు, ఉపాధ్యాయులు కుంచే బాలకృష్ణ, గ్రామ పెద్దలు యాళ్ల శేషారావు, కాశి సింహాచలం, కొల్లు సింహాద్రి,యాళ్ల కృష్ణ,బడుగు పరశురాం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మినరల్‌వాటర్‌ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర-అనపర్తి: ఊలపల్లిలో ఫార్మా జెల్ కంపెనీ ఆర్థిక సహాయం రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్(ఆర్వో) సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్లాంట్ కు కృషిచేసిన కనెక్ట్ టు ఆంధ్ర సీఈవో కోట్ల శివశంకర్ రావుని ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి,పెంకే మంగాయమ్మ గోవిందు,గంగ్రాల విజయ శేఖర్ రెడ్డి, అప్పారావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - గోపాలపురం : క్రీడల ద్వారానే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే తలారి వెంకటరావు తెలిపారు. మండలంలోని వేళ్ళ చింతల గూడెం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆర్ అండ్ యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు జరిగాయి. 12 రోజుల పాటు 32 జట్లతో జరిగిన ఈ పోటీలలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరంకు చెందిన ప్రవీణ్ పాంథర్స్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని రూ.1,50,000 నగదును కైవసం చేసుకున్నారు. దేవరపల్లి మండలం కురుకూరు గ్రామానికి చెందిన ఫ్లయింగ్ లెవెన్ జట్టు రన్నర్స్ నిలిచారు. రన్నర్స్ గా నిలిచి కప్పు రూ.70000 నగదును అందుకున్నారు. మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 30,000 అందించారు. ముగ్గుల పోటీలలో స్వాతి టీం వేసిన ముగ్గుకు మొదటి బహుమతి రాగా ఒక కాసు బంగారాన్ని గెలుచుకున్నారు. గెలుపొందిన టీంలను ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ ఆర్ అండ్ యం ఫౌండేషన్ మధు కృష్ణ, సీఐ ఏ శ్రీనివాసరావు ఎస్సై కె. రామకృష్ణ, నిర్వాహకులు పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాము,కొయ శేఖర్,కొర్లపాటి రాజా,గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓంకార స్వామీజి జయంతి వేడుకలు రద్దు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శాంతి ఆశ్రమంలో ఈనెల 21 నిర్వహించే ఓంకార స్వామిజి జయంతి వేడుకలు అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు ఆశ్రమం మేనేజిమెంట్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు, గమనించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

గుండాట, జూదం శిబిరాలపై దాడులు, కేసులు నమోదు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ఎస్పీ ఎం. రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా పోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి గుండాట, జూదముల నిర్వహణను అడ్డుకుని, గుండాట బోర్డ్లలను, టెంట్‌లను తొలగించి, కేసులు నమోదు చేశారు. ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం, ఓమ్మంగి, ఉత్తరకంచి గ్రామాల్లో గుండాట, జూద శిబిరాలపై ప్రత్తిపాడు ఎస్సై కే సుధాకర్ మరియు పోలీస్ సిబ్బందితో కలసి ఆకస్మిక దాడులు నిర్వహించి, జూద నిర్వహణను అడ్డుకుని, జూదరులను తరిమి, గుండాట బోర్డ్లలను, టెంట్‌లను తొలగించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పశు వైద్యశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - చాగల్లు: మండల కేంద్రం చాగల్లు పశువైద్యశాలనుజిల్లా పశువైద్యాధికారి డి ఎం హెచ్ ఓ డాక్టర్ సత్య గోవింద్ ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. పశు వైద్యశాలను పరిశీ లించారు. పాడిరైతులకు అందజేస్తున్న మందులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పాడి రైతులను వైద్యశాల అందజేస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకుని సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే ఆస్పత్రి సేవలు సద్వినియోగం చేసుకోని అధిక పాల దిగుబడి పాడి ఆర్థికం గా అభివృద్ధి చెందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చాగల్లు పశువైద్యాధికారి డాక్టర్ యు. ముఖేష్, కరిష్మా పాడి రైతులు పాల్గొన్నారు.

పందెం రాయుళ్లు బిజీ బిజీ

విశాలాంధ్ర - గోపాలపురం : సంక్రాంతి పండుగను పురస్కరించు కొని మండలంలోని పలు గ్రామాలలో కోడిపందాలు నిర్వహించారు. మూడు రోజులపాటు సాంప్రదాయ బద్ధంగా జరిగే ఈ పందాలు పందిపు రాయుళ్లకు ఒక వినోదంగా మిగిలింది. ఉదయం లేచింది మొదలు సాయం త్రం వరకు పందెంరాయుళ్ళ బిజీ బిజీగా గడిపారు. అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు పందాలలో పాల్గొనడం విశేషం. ఈ ఏడాది కోడిపందాలు ఆశించిన మేరకు జరగకపోవడంతో నిర్వాహకులు డీలా పడ్డారు. ముఖ్యంగా నిర్వాహకులకు ఆదాయాన్ని కోడిపందాలు గుండాట, జూదం వంటి ఆటలపై మండల పోలీసులు ఉక్కు పాదం మోపారు. తరచూ పోలీసులు బరులే వద్ద ప్రత్యక్షమవడంతో పందెంరాయుళ్ల భయాందోళన మధ్య పందాలు నిర్వహించారు.

దాతల సహకారంతో మంచినీటి ప్లాంటు ఏర్పాటు

విశాలాంధ్ర - దేవరపల్లి : దాతల సహకారంతో గ్రామంలో మంచినీరు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతో అభినంద నీయమని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి మండలం బుచ్చయ్యపాలెం గ్రామంలో గ్రామానికి చెందిన కాట్రు బ్రహ్మానందం జ్ఞాపకార్థం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్ ను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తలారి వెంకటరావు అభినందించారు ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ జి. జనార్దన్ రావు. వైఎస్ఆర్సిపి గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు జి. వెంకటేశ్వరావు, సర్పంచ్ కడిమి వీర కుమారి, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సీపీఐ పోరుబాట

- జగనన్న లబ్ధిదారుల వద్దకు సీపీఐ సైన్యం
- గోడ పత్రిక ఆవిష్కరించిన జిల్లా కార్యదర్శి తాటిపాక మధు
- టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణం స్వాధీనం చేయాలని కోరుతూ ఈనెల 18 నుంచి సీపీఐ పోరుబాట నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన గోడపత్రిక ఆవిష్కరించారు . ముందుగా మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదవాడికి స్థలం కేటాయించడం ఆనందదాయక మన్నారు. సీపీఐ అనేక సంవత్సరాలుగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేసిందని ఆయన గుర్తు చేశారు అదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 1,80,000 రూపాయలు ఏమాత్రం సరిపోవని, ఐదు లక్షలు పెంచాలని మధు డిమాండ్ చేశారు. తెలంగాణ, కేరళ, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో ఎక్కువ మొత్తంలో ఇస్తున్నారని ఇక్కడ మాత్రం తగ్గించడం దారుణం అన్నారు తూర్పుగోదా వరి జిల్లా సీపీఐ ఎర్రసైన్యం ఈ నెల 18 నుండి 30 వరకు లబ్ధిదారుల ఇల్లు వద్దకు వెళ్లి సంతకాల సేకరణ చేస్తుందని జనవరి 30న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వ హిస్తామని దీనికి అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని మధు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జటులు లేబర్ యూనియన్ అధ్యక్షులు కోండ్రపు రాంబాబు నగర కార్యదర్శి వి. కొండలరావు, నగర సహాయ కార్యదర్శి చప్ప రమణ కార్యవర్గ సభ్యులు సేపేని రమణమ్మ, నల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అంటే ఇలా ఉండాలి

విశాలాంధ్ర - కాట్రేనికోన : పోలీస్ అంటే ఇలా ఉండాలి అని నిరూపించారు అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి. కోనసీమ అల్లర్ల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన ఎస్పీ పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేశారు. ప్రజలకు భద్రత కల్పించారు. ముఖ్యంగా కోనసీమ అల్లర్లను అదుపు చేసి ప్రశాంతతను నెలకొల్పారనే ఖ్యాతిని గడించారు. కాట్రేనికోన పోలీస్ స్టేషన్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అక్రమ మద్యం అమ్మకాలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొన్న ఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఒక హోంగార్డునైతే ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించారు. కొట్లాట కేసులో లంచం తీసుకున్నారన్న ఆరోపణలు పై హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ కూడా సస్పెండ్ చేశారు. ఎస్పీ క్రమశిక్షణ చర్యలతో లంచం తీసుకోవాలంటేనే భయపడే పరిస్థితి జిల్లాలోనెలకొంది. సముద్ర తీర గ్రామాల్లో అయితే అక్రమ మద్యం వ్యాపారులను ఏరివేసి అక్రమ మద్యం, సారా వ్యాపారాలు అరికట్టారు. ఎస్పీకి భయపడి అక్రమ వ్యాపారులు గప్ చిప్ అయ్యారంటే అతిశయోక్తి కాదు. తాజాగా సంక్రాంతికి ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి తను ప్రత్యేకతను మరోసారి నిరూపించారనే చెప్పాలి. ఎంతమంది ప్రజా ప్రతినిధులు ఒత్తిళ్లు, పైరవీలు చేసినా గుండాట్లు, పేకాటలు తదితర జూదం ఆటలకు సశేమిరా అన్నారు. జూదం నిర్వాహకులపై ఉక్కుపాదం మోపారు. పండుగ ముందుగానే కోడిపందాలు బరులను తప్పించేసి, పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కోడిపందాల్లో గుండాట నిర్వాహకులు బోర్డులు వేసేందుకు సిద్ధం కాగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. టెంట్లు, కర్రలు గుండాట బోర్డులను పోలీసులు తొలగించి వారిని అక్కడ నుంచి చెదరగొట్టారు. రాజకీయంగా ఎన్ని ఒత్తిడిలు చేసినా జూదరుల పన్నాగం నెరవేరలేదు. కోడిపందాల్లో అమాయకులైన వారి నుండి గుండాటలు నిర్వహణ ద్వారా కోట్లాది రూపాయలు కాజేయాలని కుయుత్తులు చేసినా పోలీసులు సాగనివ్వలేదు. ఇందుకోసం వారం రోజుల క్రితమే గుండాటలు నిర్వహణకు ఆయా గ్రామాల్లో కోడి పందెంనిర్వాహకులకు లక్షలాది రూపాయలు చెల్లించేందుకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన గుండాట బోర్డుల వాళ్ళు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అడ్వాన్సులు కూడా ఇచ్చారు. వారి కుతంత్రాలన్నీ నెరవేరలేదు. ఎన్నో ఏళ్ల నుండి కోడిపందాలలో గుండాట్లు, జుదాలు నిర్వహించే నిర్వాహకులు కోట్లాది రూపాయలు దోపిడీ చేస్తున్నారు. పల్లెటూర్లలో అమాయకులైన ప్రజలు సర్వం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు లేకపోలేదు.

అసాంఘిక కార్యక్రమాలు జరిగేవి. స్థానిక పోలీస్, రెవిన్యూ అధికారులను సైతం మచ్చిక చేసుకుని వారికి నజరానాలు ఇచ్చి ఏదోలా కోడిపందాలు, గుండాటలను మూడు రోజులు జరుపుకునే వారు. ఆ ఆనవాయితీకి ఈ ఏడాది అడ్డుపడింది. పోలీస్ అధికారి అంటే ఇలా ప్రజా శ్రేయస్సు, భద్రత కోరి పనిచేస్తే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారనే నిజం నేడు నిరూపితమైంది.

పందెంకోడి దాడిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కిర్లంపూడి : కోడి దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కిర్లంపూడి ఎస్సై బి. తిరుపతి రావు తెలిపిన వివరాల ప్రకారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వేలంక గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన గండే సూర్య ప్రకాష్ రావు (43) కోడి పందాల బరిలో కోడిపందాలను చూస్తుండగా కత్తి కట్టిన పందెంకోడి సూర్యప్రకాశరావును వెనుక నుండి కాలుపై తీవ్ర గాయం చేసింది. దీంతో తీవ్ర గాయమైన ప్రకాశరావును నిర్వాహకులు ఆసుపత్రికి తరలిస్తుండగా తీవ్ర రక్తస్రావమైన సూర్య ప్రకాష్ మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కిర్లంపూడి ఎస్సై బి. తిరుపతిరావు తెలిపారు.

జగ్గన్నతోటలో కొలువుదీరిన ఏకాదశ ప్రభలు

విశాలాంధ్ర-అంబాజీపేట : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కనుమ రోజున జరిగే ఏకాదశ రుద్ర ప్రభల తీర్థం చరిత్ర కలిగిన ప్రభల తీర్థంగా ఖ్యాతి గాంచింది. అంబాజీపేట మండలం మొసలపల్లి, జగ్గన్న తోటలో ఏకాదశ రుద్ర ప్రభల తీర్థం ఆధ్యాత్మిక సంతరించు కుంది. గంగలకుర్రు, గంగల కుర్రు అగ్రహారం, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, కె పెదపూడి, ముక్కామల, నేదునూరు,

వక్కలంక, ఇరుసుమండ, పాలగుమ్మి గ్రామాలకు చెందిన శివాలయాల ప్రభలకు మొసలపల్లి శివాలయ ప్రభ ఏకాదశ రుద్రప్రభలకు ఆతిథ్యం ఇవ్వడం అనవాయితీగా జరుగుతుంది. ఏకాదశ రుద్రులు ఇక్కడ సమావేశం అవుతారని అందరూ సుఖసంతోషాలతో జీవించాలనే పదకొండు గ్రామాల భక్తులు నానుడి భుజస్కందాలపై శరభ...శరభ. అచ్చరభ... అంటూ తీర్థానికి చేరుకుని భక్తులు దర్శించేందుకు వరుసగా నిలుచుంటాయి. పచ్చని చేల మధ్య కొబ్బరి తోటలో జరిగే ప్రభల తీర్థానికి సుదూర ప్రాంతాలలో ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ ప్రభల తీర్థానికి వచ్చి ఏకాదశ రుద్ర ప్రభలను దర్శించుకొంటారు. ఏకాదశ రుద్రప్రభలు దేశంలో ఎక్కడా జరుగని విధంగా నిర్వహించడం చరిత్రాత్మకత సంతరించుకుందని భక్తుల నమ్మకం. భక్తులు భగవంతునిపై ఉన్న నమ్మకంతో మొసలపల్లిలోని జగ్గన్న తోట జనసంద్రంగా మారింది.

కన్నుల పండువగా కొత్తపేట ప్రభల ఉత్సవం

విశాలాంధ్ర - కొత్తపేట : మకర సంక్రాంతి సందర్భంగా కొత్తపేట జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రభల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది.

ఉభయగోదావరి జిల్లాల నుంచి తరలివచ్చిన జనంతో కొత్తపేట వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. పోటాపోటీగా సాగిన బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం ఉదయం పాత రామాలయం, కొత్త రామాలయం, బోడిపాలెం వీధుల ప్రభల ఊరేగింపు కొత్తపేట ప్రధాన పురవీధుల్లో సాగింది. ఈ మూడు ప్రధాన వీధుల ప్రభలను అనుసరిస్తూ చిన్న ప్రభలను ఊరేగించారు. ప్రభల ముందు సంగీత నాదస్వర మేళాలు, డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగింపు ముందుకు సాగింది. ప్రభలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొలువు దీర్చారు. వేలాది సంఖ్యలో ప్రజలు రాష్ట్ర నలుమూలల నుండి తరలి వచ్చారు.ఎక్కడికక్కడ రోడ్లన్నీ ప్రజలతో కిక్కిరిసిపోయాయి. అశేష సంఖ్యలో భక్తులు దేవత మూర్తులను దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మూడు వీధుల వారు నిర్వహించిన పోటా పోటీ బాణా సంచా కాల్పులు చూపరులను విశేషంగా అయితే రాత్రి నుంచి ప్రబల సంబరాలను నిలిపిన నిర్వాహకులు పోలీసులు తీరును నిరసిస్తూ ప్రభలను రోడ్డుపైనే నిలిపివేసిన నిర్వాహకులు, డాన్స్‌లను పోలీసులు అడ్డుకోవడంతో నిరసన, డాన్స్‌లకు అనుమతి ఇచ్చే వరకూ ప్రభలను తీసుకు వెళ్ళేదేలేదని చెబుతున్న ఉత్సవ కమిటీ కాదని అధికారులు ప్రభలను తొలగిస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని నిర్వాహకులు హెచ్చరించారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఉదయం పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులతో సంప్రదింపులు జరిపి సంబరాలను కొనసాగించారు. ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కొత్తపేట డిఎస్‌పి కెవి రమణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోనసీమలో శృతి మించిన రాజకీయం

విచ్చల విడిగా కోడి పందాలు, గుండాటలు అడ్డగించిన పోలీసులు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కోడిపందాల వద్ద గుండాటలకు పోలీసులు చెక్ పెట్టారు. దీంతో ఎమ్మెల్యేలకు, పోలీసులకు మధ్య కోల్డ్ వార్ జరిగింది. కొందరు ఎమ్మెల్యేలయితే శృతి మించి ప్రవర్తించారు. తొలి రోజు బ్రేకుపడినా రెండో రోజైనా అనుమతి వస్తుందని నిర్వాహకులు అధికార వైసీపీ నేతలకు ఫోన్ చేసి ప్రాధేయ పడ్డారు. పోలీస్ సింగం మాత్రం ససేమిరా అని భీష్మించుకు కూర్చోవటంతో మూడు రోజులు కోడి పందాలు జరిగి గుండాట, పేకాటలు లేకపోవటంతో పందాలు చూసి గుండాటలు, పేకాట ఆడదామని వచ్చిన యువకులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ ఏడాది గుండాటలు లేని ఎఫెక్ట్ తీవ్ర ప్రభావం చూపింది. కోనసీమ కోడి పందాలు ఇటు పోలీసులు అటు ప్రజా ప్రతినిధులకు మధ్య తీవ్రమైన అగాథాన్ని సృష్టించింది. అది ఎంత వరకూ దారి తీసింది అంటే నువ్వా నేనా అన్న స్థాయిలో పట్టుదలకు పోయింది. కులాల కోనసీమలో వివాదం పోలీసులు ప్రజా ప్రతి నిధులు పట్టుదలకు పోవటంతో అక్కడక్కడా గుండాటలు ఆడుతుంటే పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఆటంకాలు లేకుండా సాగిన కోడిపందాలు, గుండాటలు మొట్టమొదటి సారిగా నిలువరించిన పవర్ ఫుల్ ఆఫీసురుగా కోనసీమ ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి తొలిసారిగా ఖ్యాతిని గాంచారు. సర్వత్రా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డికి ప్రశంసలు దక్కాయి. కోనసీమ కు మొనగాడు ఎస్పీ వచ్చాడు అంటూ పలువురు ప్రశంసించారు. కొత్తపేటలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, పి గన్నవరం, రాజోలు ఎమ్మెల్యేలు శృతి మించి ప్రవర్తించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసుల పట్ల అనుచితంగా వ్యాఖ్యలు చేసినట్లు విమర్శలు వచ్చాయి. చివరి రోజు అశ్లీల నృత్యాలు మరింత దిగజారి చేశారు. కొత్తపేటలో పట్టపగలు ఊరేగింపుగా అశ్లీల నృత్యాలు చేస్తూ పట్టణంలో సందడి చేశారు. గంటి పెదపూడిలో పుట్టినరోజు సందర్భంగా నృత్యాలు ఏర్పాటు చేసి సందడి చేశారు. రాజోలు, పి గన్నవరంలో నృత్యాలు జోరుగా సాగినట్లు వార్తలు వచ్చాయి. సంక్రాంతి సంబరాలు సందర్భంగా పోలీసులు, రాజకీయ నాయకులకు మధ్య రేగిన అగాధం ఎప్పటికి చల్లారుతుందో.

భక్తాంజనేయస్వామి జాతర

విశాలాంధ్ర-అనపర్తి: శ్రీ భక్తాంజనేయ స్వామి జాతర, తీర్థ మహోత్సవం సందర్భంగా అనపర్తి మండలం కుతుకులూరులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ కర్రి రామ్ గోపాల రెడ్డి(చెన్నై) సోమవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ ఎంత బిజీగా ఉన్నప్పటికీ సంక్రాంతికి మాత్రం సొంత గ్రామం రావడం ఉత్సవాల్లో పాల్గొనడం జరుగుతుందని అదే విధంగా చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకుని సరదాగా గడపడం జరుగుతుందని రాంగోపాల్ రెడ్డి తెలిపారు.ఆయనతో పాటు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరి సాయి కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షులు పడాల వెంకటరెడ్డి,హివాగ గ్రూప్స్ అధినేత రామ్మోహన్ రెడ్డి,పడాల తమ్మి రెడ్డి, నల్లమిల్లి హరి నారాయణ రెడ్డి, నెల్లిమర్ల శ్రీనివాస రావు,ఎస్ వి కె రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

చెయ్యేరులో ఘనంగా ప్రభల తీర్థం

విశాలాంధ్ర - కాట్రేనికోన : సంక్రాంతి పండుగ సందర్భంగా కనుమ రోజు సోమవారం చెయ్యేరు గ్రామంలో ప్రబల తీర్థం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ప్రబలను తిలకించారు. స్థానికంగా ఉన్న అమ్మవారి ఆలయంలో పూజలు చేసి కానుకలు సమర్పించుకున్నారు. చెయ్యేరు అగ్రహారం, పెనుమల్ల తదితర గ్రామాలలో అందంగా తీర్చిదిద్ది ఊరేగింపుగా తీసుకొచ్చిన ప్రభలను కన్నుల పండుగగా తిలకించారు. మహిళలు ప్రబలకు పూజలు చేశారు. చెయ్యేరు లోని నంద్యాల బాలయోగి సెంటర్, కాలవ గట్టు సెంటర్ ప్రభలను రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వైభవంగా కేశవరం జాతర

విశాలాంధ్ర - మండపేట : ప్రసిద్ది చెందిన కేశవరం శ్రీ గని పోతు రాజు స్వామి వారి జాతర మహోత్సవలు సోమవారం వైభవంగా ఆరంభమయ్యాయి. మండపేట మండలం కేశవరం గ్రామంలో గని పోతురాజు స్వామి వారి తీర్థ మహోత్సవల సందర్భంగా స్వామి వారిని మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండపేట ఎంపిపి వుండమట్ల వాసు, ఆలయ కమిటీ చైర్మన్ కూసు నరసింహమూర్తి, కమిటీ సభ్యులు పురంసెట్టి శ్రీనివాస్, చెబోలు కుమారి, కొల్లి నాగమణి, కొక్కిరి కామేశ్వరరావు, నాతిపాము ఆదిలక్ష్మి, సమ్మతం సత్యవతి, వైసిపి సీనియర్ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, మండల ఆర్‌బికె చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపిటిసి సభ్యులు అన్నందేవుల కృష్ణ, చంద్రమళ్ళ పోతురాజు, కొల్లి సుబ్రహ్మణ్యం, మన్నే నారాయణమూర్తి, మన్నే భూషణం, ముక్కపాటి శ్రీనివాస్, చంద్రమళ్ల ఎసియ్య, తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ అన్నందేవుల శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. రూరల్ ఎస్ఐ బళ్ల శివ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - గండేపల్లి : సంక్రాంతి తెలుగు వారికి అతి పెద్ద పండుగ. ఈ మూడు రోజులు వేటికి అవే ప్రత్యేకతను సంతరించుకుంటాయి. భోగి మంటలు, కోడి పందాలు, ఎడ్ల బండ్లు, రంగ వల్లులు, గొబ్బెమ్మలు, గాలి పటాలు, హరిదాసులు, గంగిరెద్దులు. వీటిలో కొన్ని సంప్రదాయాలు అంతరించి పోగా మిగిలిన వాటిలో కొన్ని కొనఊపిరితో కొట్టుమిట్టాడు తున్నాయి. సంక్రాంతికి మోడరన్ హరిదాసుల హవా కొనసాగుతోంది. పెదపూడి మండలం సంపర గ్రామంలో హరిదాసు కథ వేరు. ద్వారకాతిరుమలకు చెందిన ఈయన మాట్లాడుతూ తమ కుటుంబం గత ఆరు దశాబ్దాల నుండి వంశ పారంపర్యంగా నెల రోజుల పాటు సంక్రాంతి పండుగ వరకు గ్రామంలో వీధివీధి హరినామ సంకీర్తనతో తిరుగుతూ హరిదాసు రూపంలో తమ తాత, తర్వాత తన మేన మావయ్య ఈ తరంలో తాను ఈ ఆచారాలను కొనసాగిస్తూ వస్తున్నామని తెలిపారు. ఇటీవలే తనకు ప్రమాదవశాత్తు ఒక కాలు తీసేయవలసి వచ్చిందని అందువలననే త్రీ వీలర్ పై తన సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని తెలియజేశారు. ఇటువంటి సంప్రదాయాలను ప్రతిబింబించే కళలను, కళాకారులను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉంది.

ప్రజల మనోభావాలకు అనుగుణంగా పోలీసులు వ్యవహరించాలి

విశాలాంధ్ర-అనపర్తి: ప్రజల మనోభావాలకు అనుగుణంగా పోలీసులు వ్యవహరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వీరుళ్ళమ్మ గుడి ఆవరణలో సాంప్రదాయంగా జరుగుతున్న క్రీడలను అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్కిల్ గేమ్ ఆపాలని ప్రయత్నించిన పోలీసులకు ఎమ్మెల్యే సత్తి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఎక్కడ లేనిది ఒక అనపర్తి మండలంలోనే ఎందుకు ఆపాలని ప్రయత్నిస్తున్నారని పోలీసు అధికారులను ప్రశ్నించారు. గేమ్స్ ఈ ఏడాది కొత్తగా జరుగుతుంది కాదని గత 40 ఏళ్లగా అనపర్తి, కుతుకులూరులో సాంప్రదాయ బద్ధంగా జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇక్కడ వచ్చే ఆదాయం అమ్మవారికి చెందుతుందే తప్ప ఎవరు జేబులు నింపుకోవడానికి కాదని ఘాటుగా హెచ్చరించారు. ఎమ్మెల్యే తో పాటు సతీమణి ఆదిలక్ష్మి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), జడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకులు సత్తి రామారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ ఎస్), సర్పంచ్ వారా కుమారి, పార్టీ పట్టణ ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీ, ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

కొత్తపేట డివిజన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా సుమలత

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట డివిజన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిణిగా ఎం. సుమలతను నియమిస్తూ కోనసీమ డిఎం అండ్ హెచ్ఓ ఎం. దుర్గారావు దొర ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ఆలమూరు మండలం చొప్పెల్ల పీహెచ్సీలో ప్రధాన వైద్యాధికారిణిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆలమూరు మండలంలో ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ కోవిడ్‌ను నియంత్రించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించి, సంబంధిత గ్రామాల్లో నూరు శాతం వ్యాక్సినేషన్ అందించిన ఏకైక వైద్యులుగా గుర్తింపు సాధించారు. ఈమె వైద్య సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోనసీమ జిల్లా డిఎం అండ్ హెచ్ఓ కొత్తపేట వైద్య ఆరోగ్యశాఖ డివిజనల్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డివిజనల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సుమలతను మండల వైకాపాకు కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఆకుల రామకృష్ణ, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు, దంగేటి బాపనయ్య పలువురు అభినందించారు.

యథావిధిగా కోడి పందాలు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో పలు చోట్ల యథావిధిగా కోడి పందాలు కొనసాగాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కోడి పందాలు జోరుగా జరిగాయి. ప్రధానంగా నాగంపల్లి, చీపురుపల్లి, మిర్తుపాడు గ్రామాల్లో నాయకుల కనుసన్నల్లో కోడి పందాలు జోరుగా సాగాయి. అధికారులు మాత్రం గత వారం రోజులుగా చేస్తున్న హెచ్చరికలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని పలువురు విమర్శిస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది గుండాట లేకపోవడం కొంత వరకు మేలు జరిగింది అని చెప్పవచ్చు. పందాల వద్ద ఏరులై పారిన మద్యం, బిర్యానీ, పానిపూరి, స్వీట్ కార్న్ స్టాల్ ఏర్పాట్లు కూడా చేశారు. కష్ట జీవుల కష్టార్జితం పండుగ రోజులో నిలువు దోపిడీ జరిగింది అనడంలో అతిశయోక్తి లేదు.

అసభ్యకర పోస్టులు పెడుతున్నాడంటూ వ్యక్తి పై దాడి

విశాలాంధ్ర - సీతానగరం : సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్నాడు అంటూ ఒక వ్యక్తి పై దాడి కేసు నమోదు చేసిన ఎస్ఐ శుభ శేఖర్. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆకుల లక్ష్మణరావు అనే వ్యక్తి స్థానిక రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. సామాజిక మాధ్యమాల్లో కొన్ని అసభ్యకరమైన పోస్టులను షేర్ చేశాడనే సందేహం కారణంగా మట్టా నాని, మట్టా నల్లబాయి, ముత్యాలు హరీష్, ముత్యాలు మహేష్ అనే నలుగురు యువకులు చేతులమీద ఇనుప రాడ్లుతోకొట్టి, కాళ్ళతో తన్ని, భయంకరమైన పదజాలంతో కుటుంబ సభ్యులను దూషించి చంపుతామని బెదిరించారని కేసు నమోదు చేశామని, దెబ్బలు తగిలిన వ్యక్తిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించామని అన్నారు.